క్లుప్తంగా

వైఎస్సార్‌టీయూసీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మన్సూర్


మోమిన్ మన్సూర్

నందికొట్కూరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌టీయూసీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మోమిన్ మన్సూర్‌ను కేంద్ర పార్టీ కార్యాలయం ఎంపిక చేసింది. మిడుతూరు మండలం ఉప్పలదడియా గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన మన్సూర్‌కు పెద్ద బాధ్యతలు అప్పగించడంతో గ్రామ, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆశీస్సులతో ఇచ్చిన బాధ్యతలను విస్మరించకుండా పని చేస్తానన్నారు.

చెరువుల మరమ్మతుకు ప్రతిపాదనలు

కొత్తపల్లి: మండలంలోని చెరువుల మరమ్మతులకు రూ.7.74 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు మైనర్ ఇరిగేషన్ ఏఈ శివకుమార్ తెలిపారు. సోమవారం ఆయన కొత్తపల్లిలో మాట్లాడారు. మండలంలోని 6 చెరువులకు గాను రూ.7.74 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, ఆర్ఆర్ఆర్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయిస్తుందని తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతుల పనులు చేపడతామన్నారు.

పాఠ్య పుస్తకాలు మంజూరు

జూపాడుబంగ్లా: మండలానికి స్పెల్–బీ పాఠ్య పుస్తకాలు మంజూరైనట్లు ఎంఈఓలు చిన్నమద్దిలేటి, శ్రీనివాసులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ స్పెల్–బీ కింద మండలానికి 8,565 పాఠ్యపుస్తకాలు మంజూరయ్యాయన్నారు. వీటిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేసి విద్యార్థులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కార్డుల పంపిణీ పూర్తిచేయండి

పగిడ్యాల: ఈనెల 15లోగా స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియ పూర్తిచేయాలని తహసీల్దార్ శివరాముడు వీఆర్వోలను ఆదేశించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలానికి 10,708 రేషన్‌కార్డులు మంజూరయ్యాయని, లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి బయోమెట్రిక్ నమోదు చేసి కార్డులు అందజేయాలని వీఆర్వోలకు సూచించారు. కాగా వీఆర్వోలు రేషన్ దుకాణాల వద్దే కూర్చొని లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి

వెలుగోడు: పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని రేగడగూడూరు వైద్యాధికారి ఎం.సుమన్ సూచించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా సోమవారం రేగడ గూడూరు గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య, గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఆత్మకూరు మార్కెట్ యార్డు చైర్మన్ కస్తూరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమన్ మాట్లాడుతూ కొన్ని పశువుల్లో మొదటి ఎద వయసు వచ్చినా ఎదకు రాకుండా ఉంటాయన్నారు. దీనికి గర్భకోశం ఎదగకపోవడం కారణం కావచ్చన్నారు. పశువులు ఎదకు రాకపోతే వైద్యులకు చూపించి గర్భకోశం ఎదుగుదల పరీక్షలు చేయించి, తగిన చికిత్సలు చేయించాలన్నారు. అనంతరం పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని సందర్శించిన చిన జీయర్ స్వామి శిష్యులు


అమ్మవారిని దర్శించుకున్న చినజీయర్ స్వామి శిష్యులు

నందికొట్కూరు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని చిన జీయర్ స్వామి శిష్యులు సోమవారం సందర్శించారు. కన్యకా పరమేశ్వరి దేవిని, నగరేశ్వరస్వామి, వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి అమ్మవారు ఆశీస్సులు పొందారు. అంతకుముందు ఆలయ పురోహితులు, కమిటీ అధ్యక్షులు జయరామక్రిష్ణ, సభ్యులు వారికి స్వాగతం పలికారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ నరేంద్ర

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా నరేంద్ర సోమవారం బాధ్యతలు చేపట్టారు. సత్యసాయి జిల్లా రొద్దం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ముచ్చుమర్రికి బదిలీ అయిన ఎస్‌ఐ సాయంత్రం విధుల్లో చేరారు. ఎస్‌ఐకు ఏఎస్‌ఐ సుబ్బారావు, స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు.

స్తంభాలు పాతారు... కనెక్షన్ మరిచారు!

- త్రీఫేస్ విద్యుత్ సరఫరాకు నోచుకోని తాటిపాడు గ్రామం
- నత్తనడకన ఆర్డీఎస్ఎస్ విద్యుత్ సరఫరా పనులు
- పట్టించుకోని ట్రాన్స్‌కో పర్యవేక్షణాధికారులు

జూపాడుబంగ్లా: ఆర్డీఎస్ఎస్ విద్యుత్ సరఫరా పథకంలో భాగంగా మండలంలోని పోతులపాడు, చాబోలు, 80 బన్నూరు, లక్ష్మీనగర్, తాటిపాడు, తూడిచెర్ల, కనకయ్య కొట్టాల, తరిగోపుల గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేసి కనెక్షన్ ఇవ్వకపోవటంతో గ్రామాలకు త్రీఫేస్ కరెంట్ సరఫరాలేక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పల్లెలకు నిత్యం త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేసేందుకు గాను (ఆర్డీఎస్ఎస్)రీ వ్యాంప్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం లో భాగంగా గ్రామాల్లో నూతన విద్యుత్‌స్తంభాలను ఏర్పాటుచేసి 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేశారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ ట్రాన్స్‌ఫార్మర్లకు కనెక్షన్ ఇవ్వకుండా వదిలేయడంతో మూడు మాసాల నుంచి గ్రామాలకు త్రీఫేస్ కరెంట్ సరఫరా గాక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తరిగోపుల గ్రామంలో మాత్రమే త్రీఫేస్ విద్యుత్ కనెక్షన్ సరఫరా చేయడంతో ఆ గ్రామానికి మాత్రమే నిరంతరం త్రీఫేస్ విద్యుత్ సరఫరా అవుతుండగా మిగిలిన గ్రామాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవటంతో ఆయా గ్రామాలకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా కావటం లేదని గ్రామస్తులు, ట్రాన్స్‌కో సిబ్బంది పేర్కొంటున్నారు. పోతులపాడు, చాబోలు, 80బన్నూరు, లక్ష్మీనగర్, తాటిపాడు, తూడిచెర్ల, కనకయ్యకొట్టాల, గ్రామాల్లో ఆర్డీఎస్ఎస్ పనులు జరిగాయి. కాంట్రాక్టర్ పనులు నత్తనడకన చేయిస్తుండటంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పర్యవేక్షణాధికారులు కూడా పట్టించుకోకపోవటంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏడీఏ శ్రీనివాసులు వివరణ కోరగా పనులు త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేస్తున్నా స్పందించడం లేదని, మరోమారు చెప్పిచూస్తామని ఫలితం లేకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు.


తాటిపాడులో కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన ఆర్డీఎస్ఎస్ త్రీఫేస్ విద్యుత్‌సరఫరా ట్రాన్స్‌ఫార్మర్లు


శ్రీశైల ముఖద్వారానికి పెయింటింగ్ పనులు చేస్తున్న కార్మికులు


భ్రమరాంబా అతిథిగృహం ఎదురుగా సీసీ రోడ్డు నిర్మాణం

ప్రధాని పర్యటనకు ఏర్పాట్లు షురూ..!

శ్రీశైలంటెంపుల్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16న శ్రీశైలంలో పర్యటిస్తారనే సమాచారం మేరకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రధాని రాక కోసం శ్రీశైలం ముస్తాబవుతోంది. 16న ప్రధాని మోదీ శ్రీశైలం చేరుకుని భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటారు. అనంతరం శ్రీశైలం కర్నూలు వెళ్తారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో శ్రీశైల ముఖద్వారానికి రంగులు దిద్దుతున్నారు. భ్రమరాంబా అతిథి గృహానికి, దేవస్థాన కార్యాలయ భవనానికి రంగులు వేస్తున్నారు. టోల్‌గేట్ నుంచి మల్లికార్జున సదన్ సర్కిల్ వరకు తారు రోడ్డు, భ్రమరాంబా అతిథి గృహం ఎదురుగా సిమెంట్‌రోడ్డు వేస్తున్నారు. భ్రమరాంబా అతిథిగృహం వద్ద గోడలకు బొమ్మలు వేస్తున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా పోలీసులు డ్రోన్ కెమెరాలతో ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్నారు.


భ్రమరాంబా అతిథిగృహం వద్ద గోడలకు బొమ్మలు వేస్తున్న దృశ్యం


డ్రోన్ సాయంతో భద్రతను పరిశీలిస్తున్న ఎస్‌ఐ సుబ్బారెడ్డి

ఎండాకు తెగులుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


రైతుకు సూచనలిస్తున్న మండల వ్యవసాయ అధికారి

బండి ఆత్మకూరు: వరి పంటకు సోకిన ఎండు తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఆర్. పవన్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన సోమయాజుపల్లి, ఈర్నపాడు గ్రామాల పరిధిలోని వరి పొలాలను పరిశీలించారు. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల వరి పంటకు ఎండాకు తెగులు, తుప్పు తెగులు, పొడ తెగుళ్లు ఆశించాయన్నారు. ఎండాకు తెగులు నివారణకు ఎకరాకు 500 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను పిచికారీ చేయాలని, పొడ తెగులుకు 400 గ్రాముల హెగ్జా కోనాజోల్‌ను, తుప్పు తెగులుకు ఎకరాకు కార్బండజైమ్‌ను 250 గ్రాములు 15 రోజులకోసారి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రియాంక పాల్గొన్నారు.

జూపాడుబంగ్లాలో 43.2 మి.మీ వర్షం


కర్నూలు–గుంటూరు రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం కురిసింది. 43.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూపాడుబంగ్లాలో డ్రైనేజీలేక కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారితో పాటు బొడ్డురాయి వీధి, సంతమార్కెట్ వీధి, పింజరిపేట, బీసీ కాలనీల్లోని రోడ్లపై వర్షపు నీరు ప్రవహించాయి. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణాలు వర్షం నీటితో నిండిపోయాయి. తంగడంచ, మండ్లెం, తరిగోపుల, పారుమంచాల వీధిలో రోడ్లు జలమయమయ్యాయి.

ఇంజిన్ బోట్లు తిప్పరాదు

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ సమీపంలోని శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో ఇంజిన్‌బోట్లు తిప్పరాదని డిప్యూటీ తహసీల్దార్ మురళి సూచించారు. మూర్వకొండ, అర్లపాడు ఘాట్లను ఆయన సందర్శించారు. ఇంజిన్‌బోట్లు తిప్పితే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు.

పుస్తకాలు విరాళం


పుస్తకాలను విరాళమిస్తున్న పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ సభ్యులు

నందికొట్కూరు: స్థానిక గ్రంథాలయానికి పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ వారు సోమవారం 150 పుస్తకాలను విరాళమిచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మురళి మాట్లాడుతూ పుస్తకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దొంగ ఓట్లతో గద్దెనెక్కిన బీజేపీ

నందికొట్కూరు: దేశంలో దొంగ ఓట్లతో బీజేపీ గద్దెనెక్కిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తేనె నాగరాజు ఆరోపించారు. ఎన్డీయే దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిందనే అంశంపై సోమవారం ట్యాంక్ ఏరియాలో ప్రజలతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా సంతకాలు చేసేందుకు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ ఉస్మాన్‌బాషా, పబ్బతి శ్రీరామ్, ప్రధాన కార్యదర్శి సుంకన్న గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

జూపాడుబంగ్లా: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తడిసిన మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికవర్షాలు దిగుబడులపై ప్రభావం చూపాయన్నారు. ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్లలోపు దిగుబడి వచ్చిందన్నారు. పంటనష్టపోయిన రైతులకు పరిహారం మంజూరు చేయాలని, దిగుబడులను క్వింటాల్ రూ.3 వేల మద్దతు ధరతో కొనుగోలు చేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్‌లకు వినతి పత్రాలు అందజేశారు.

వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించాలి

నందికొట్కూరు: భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురామమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం బ్రాహ్మణకొట్కూరు, వడ్డేమాన్, అల్లూరు, మల్యాల గ్రామాల్లో పర్యటించి భవన నిర్మాణ కార్మికుల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా కార్మిక వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మహమ్మద్ రఫీ, నూరుల్లాబేగ్, విష్ణు, ప్రతాప్, షేక్షావలి, అన్వర్, రాజు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సర్వే భారం మోపొద్దు


మున్సిపల్ కమిషనర్ బేబికి వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

నందికొట్కూరు: సచివాలయ ఉద్యోగులపై ఇంటింటి సర్వే భారం మోపొద్దని ఏపీవీడబ్ల్యూఎస్ఈజేఏసీ నాయకులు రాంబాబు కోరారు. ఏపీవీడబ్ల్యూఎస్ఈ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి నిర్వహించే సర్వేలు తీసివేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆరేళ్ల పాటు ఒకే కేడర్‌లో సర్వీస్ చేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలన్నారు. సీనియారిటీ ఆధారంగా ప్రమోషన్లు, పారదర్శక బదిలీలకు విధి విధానాలు ఖరారు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బేబికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు సుల్తాన్‌బాషా, సుధాకర్, బాలబిచ్చన్న, మద్దిలేటి, ఆశాజ్యోతి, వెంకటరమణమ్మ, ఆదిలక్ష్మి, శిరీషా, శ్రీదేవి పాల్గొన్నారు.

అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు: నేషనల్ హైవే –167 నిర్మాణంలో భాగంగా బాపనంతాపురం వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి సుధాకర్, మండల నాయకులు మాబాషా సోమవారం తహసీల్దార్ రత్నరాధికకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్, వీరన్న, అంబయ్య, పండ్ల తోటల సంఘం మహబూబ్‌బాషా, బాపనంతపురం గ్రామ దళితులు ఏసన్న, చంద్రశేఖర్, చిన్నలింగన్న, స్వామిదాసు, సత్యరాజు, జమ్ములయ్య, సంజీవ, జయన్న, స్వాములు పాల్గొన్నారు.

పల్లకీలో విహరించిన ఆది దంపతులు


పల్లకీసేవలో మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందీశ్వరుడి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, శాంతారాంభట్, అర్చకులు ముందుగా స్థానిక అలంకార మండపంలో గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మహా మంగళ హారతులు, బలిహరణ అనంతరం ఆలయ ప్రాకారంలో పల్లకీ ఉత్సవం జరిపారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

భ్రామరీకి లక్షకుంకుమార్చన


కుంకుమార్చన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం పౌర్ణమి ఘడియలు ప్రారంభమవడంతో సాయంత్రం లక్ష కుంకుమార్చన సేవను జరిపించారు. శ్రీశైలానికి స్వయంగా రాలేని ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలకు చెందిన 19 మంది భక్తులు పరోక్షసేవ ద్వారా సేవను నిర్వహించుకున్నారు. ముందుగా అర్చకులు పూజాసంకల్పం పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజను జరిపి లక్షకుంకుమార్చన సేవను జరిపించారు.

స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు


స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం

శ్రీశైలంటెంపుల్: పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానంలోని స్వామిఅమ్మవార్లకు సోమవారం విశేషపూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్లకు పల్లకీ, ఊయల సేవలను నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించి, మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి షోడశోపచార పూజలు జరిపారు.

పంచమఠాల్లో విశేష పూజలు


స్వామివారికి పూజలు నిర్వహించిన దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో లోకకల్యాణార్థం పంచమఠాలలో విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు. సోమవారం ఉదయం భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠాలలో పూజాదికాలు జరిపించారు. ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు జరిపారు. అనంతరం అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఏఈఓ హరిదాసు, ఉపప్రధానార్చకులు, అర్చకులు పాల్గొన్నారు.

మహానందీశ్వరస్వామి సన్నిధిలో ప్రముఖులు

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో సోమవారం పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. బెంగుళూరు అడిషనల్ ఎస్పీ దీపక్, జెన్‌కో చీఫ్ ఇంజినీర్ తిరుమల ప్రసాద్ వేర్వేరుగా మహానందికి చేరుకుని కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ అధికారులు వారికి స్వామి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

పూజల విషయంలో ఘర్షణ

- ఇద్దరికి గాయాలు


గాయపడిన రమణారెడ్డి, శ్రీనివాస ఆచారి

కొత్తపల్లి: తన ఇంటి ముందు ఉన్న పురాతన ఆలయంలోనే ముందు పూజలు, కొబ్బరికాయ కొట్టాలన్న విషయంలో జరిగిన ఘర్షణలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు మండలంలోని జి.వీరాపురం గ్రామ ప్రజలు ఏటా వర్షాలు బాగా కురిసి, పంటలు బాగాపండాలని నల్లమల అటవీప్రాంతంలోని వరదరాజస్వామికి ప్రత్యేక పూజలు చేస్తారు. అందులో భాగంగానే వరదరాజస్వామి వద్దకు వెళ్లే సమయంలో గ్రామంలోని ఆలయాల్లో ముందుగా పూజలు చేసి, టెంకాయ కొట్టడం ఆనవాయితీ. గ్రామ పెద్ద బోరెడ్డి రమణారెడ్డి మహిళలతో,మేళ తాళాలతో రామాలయంలో పూజ చేసి కాయ కొట్టే సమయంలో పక్కనే ఉన్న కమ్మరి శ్రీనివాస ఆచారి తన ఇంటివద్ద ఉన్న బ్రహ్మం గారి ఆలయం పురాతనమైనదని అక్కడే మొదట పూజలు చేయాలని ఘర్షణ పడ్డాడు. ఘర్షణలో శ్రీనివాస ఆచారి, రమణారెడ్డిపై బడిసె(చెక్కపని చేసే పరికరం)తో తలపై బలంగా కొట్టడంతో లోతైన గాయమై అపస్మారక స్థితిలో పడిపోయాడు. దీంతో అక్కడున్న కొంతమంది గ్రామస్తులు శ్రీనివాస ఆచారికి దేహశుద్ధి చేయడంతో కుడి కన్నుపై రక్త గాయం, మెడవద్ద, వీపుపై, నడుముపై కందిన గాయాలు అయ్యాయి.గ్రామస్తులు 108కి ఫోన్ చేయగా సిబ్బంది అక్కడికి చేరుకుని గాయపడిన వారిని ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం రమణారెడ్డిని కర్నూలుకి తరలించారు. ఈ విషయమై ఏఎస్‌ఐ రామ్‌నాయక్ మాట్లాడుతూ రమణారెడ్డి భార్య చిన్నక్క ఫిర్యాదు చేసిందని, విచారించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

పరిహారం ఇవ్వాలి


ఏఓకు సమస్యను వివరిస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్

ఆత్మకూరు: అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం అందజేసి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్ కోరారు. సోమవారం వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, ఏఓ హేమలతకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40 వేల చొప్పున పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, ఏపీ రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మాబాషా, ఎం.వీరన్న, పండ్ల తోటల సంఘం అధ్యక్షుడు బి.మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

పాములపాడు: ఇటీవల కురిసిన వర్షాలకు పంటలను నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు కోట్ల నాగేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం మండల అధ్యక్షులు అంబయ్య, మండల కార్యదర్శి టి వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.సోమన్న డిమాండ్ చేశారు. ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో తసీసిల్దార్ సుభద్రమ్మకు సోమవారం వారు వినతి పత్రం అందించారు.

స్వచ్ఛాంధ్రలో సున్నిపెంట పాఠశాలకు మొదటిస్థానం



ప్రసన్నలక్ష్మికి అవార్డు అందజేస్తున్న కలెక్టర్

శ్రీశైలంప్రాజెక్ట్: స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సున్నిపెంట గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు జిల్లాలోనే మొదటి స్థానం లభించింది. సోమవారం నంద్యాలలో కలెక్టర్ జి.రాజకుమారి చేతులమీదుగా పాఠశాల హెచ్‌ఎం కె.ప్రసన్నలక్ష్మి స్వచ్ఛాంధ్ర జిల్లా ఉత్తమ అవార్డును స్వీకరించారు.

జూపాడుబంగ్లాలో..


సత్యనారాయణమూర్తి, ఉమాదేవి

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్, అంబేడ్కర్ గురుకుల పాఠశాలలకు స్వచ్ఛత అవార్డులు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, వార్డెన్ ఉమాదేవి తెలిపారు. సోమవారం నంద్యాలలో కలెక్టర్ రాజకుమారి చేతులమీదుగా అవార్డులు అందుకోవటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అలాగే 80 బన్నూరు పంచాయతీకి స్వచ్ఛాంధ్ర అవార్డు, జూపాడుబంగ్లాకు చెందిన గ్రీన్‌అంబాసిడర్ రమణమ్మకు, ఏపీఎం అంబమ్మకు స్వచ్ఛాంధ్ర అవార్డులు మంజూరు కాగా వారు కలెక్టర్ చేతులమీదుగా అవార్డులు అందుకున్నారు.

ఉత్తమ వర్కర్‌గా..


ప్రభాకర్

నందికొట్కూరు: మున్సిపాలిటీ స్వీపర్ బి.ప్రభాకర్ ఉత్తమ అవార్డును కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నందికొట్కూరు మున్సిపాలిటీ స్వీపర్‌ను కలెక్టర్ ఘనంగా సన్మానించి ఉత్తమ అవార్డు ఇచ్చారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ బేబి అభినందనలు తెలిపారు.